క్లుప్తంగా

ఈ క్రాప్‌లో పంట వివరాల నమోదు



కొల్లిపర: రబీలో రైతులు పొలంలో సాగు చేస్తున్న జొన్న, మొక్కజొన్న, మినుము పంటల వివరాలను వారి పేరుతో ఈ క్రాప్‌లో ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని ఏవో కె.వెంకటరావు తెలిపారు. 2023-24 రబీకు సంబంధించి ఆర్బీకే సిబ్బంది పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవటం వలన పంట నష్టం జరిగినప్పుడు పెట్టుబడి రాయితీ, పంట బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, పంట కొనుగోలు వంటి ప్రయోజనాలు ప్రభుత్వం నుంచి రైతులకు అందుతాయని అన్నారు. కౌలు రైతులు, రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏఎస్ఎన్ కళాశాల విజేత

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఈ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల జట్టు విన్నర్స్‌గా నిలవగా, రన్నర్స్ స్థానాన్ని పట్టణానికే చెందిన గుప్త డిగ్రీ కళాశాల జట్టు దక్కించుకుంది. ముగింపు కార్యక్రమంలో రోటరీ క్లబ్ నుంచి ఈదర వెంకట పూర్ణచంద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నుంచి బి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, స్టేడియం ఇన్‌ఛార్జి కె.నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుజ్జిబాబు పాల్గొన్నారు. పోటీల్లో ఉత్తమంగా రాణించిన క్రీడాకారులను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్టు మార్చిలో కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరగనున్న దక్షిణభారత అంతర్ యూనివర్సిటీల పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు.

నేడు దళిత ఉద్యమకారుడు కనపర్తి సంస్మరణ సభ



తెనాలి: ప్రతిఘటనోద్యమ దళ సారథి, ప్రథమ తరం దళితోద్యమ నేత, బహుజన మేధావి కనపర్తి ఏసురత్నం జ్ఞాపకాలతో 'ఓ సాయంత్రం' కార్యక్రమాన్ని పట్టణ సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయ్యే సభలో పలు ప్రజాసంఘాల నేతలు పాల్గొననున్నారు. వక్తగా, కళాకారుడిగా, దళిత ఉద్యమకారుడిగా మూడు దశాబ్దాలుగా చిరపరిచితుడైన ఏసురత్నం తన స్వస్థలమైన కొల్లిపరలో ఇటీవల హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ప్రజాసంఘాల నేతలు హాజరై ఆయనకున్న భిన్న పార్శ్వాలతో గల సంబంధాలను గుర్తుచేసుకుంటారని వివరించారు. ఆ జ్ఞాపకాల్లో స్ఫూర్తివంతమైన జీవితాన్ని తెలుసుకునేందుకు అభిమానులు, ఉద్యమకార్యకర్తలు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలిటౌన్: చైల్డ్ ఫర్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెనాలి ఏరియా వైద్యశాలలో శనివారం దీర్ఘకాలిక రోగులకు పౌష్టికాహారం అందజేశారు. దివంగత అధ్యాపకులు తాళ్లూరి జక్రయ్య వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాలలోని ఏఆర్‌టి సెంటర్‌లో ప్రాజెక్ట్ డీఆర్ఎం వాసుదేవరావు, మెడికల్ ఆఫీసర్ రమ్యకృష్ణ, ఏఆర్‌టి కౌన్సిలర్స్ రత్నకుమారి, వరలక్ష్మి, జ్యోతి, క్రిష్టిఫర్, బి.నాగేశ్వరరావు, కె.సునీల్, జాన్ బనియన్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా సాగాలి

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సినీనటుడు నాగబాబు

తెనాలిఅర్బన్: ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలపై రాష్ట్రంలో అనేక పోరాటాలు చేస్తున్న రాజకీయ పార్టీ జనసేన అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సినీ నటుడు నాగబాబు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలి బోసురోడ్డులోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీని తెనాలిలో బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించనున్నదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు తోటకూర రమణరావు, హరిదాసు గౌరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రానందంగా చండీసహిత హనుమథీశ్వర మహాయజ్ఞం

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దంపతులు
- భారీసంఖ్యలో హాజరైన భక్తజనం



గణపతికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో శ్రీ చండీసహిత హనుమథీశ్వర మహాయజ్ఞం వైభవంగా ఆరంభమైంది. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో తొలిసారిగా 2019 జనవరి 6,12 తేదీల్లో శ్రీ చండీ సహిత హనుమథీశ్వర మహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్–పుష్ప దంపతులు, మళ్లీ ఇప్పుడు అవే తేదీల్లో యజ్ఞ నిర్వహణకు పూనుకున్నారు. ముందు రోజైన 5వ తేదీ సాయంత్రం పట్టణంలో శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం మహాయజ్ఞంకు అంకురార్పణ చేశారు. ముందుగా దంపతులిద్దరూ శ్రీవాసవీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం యజ్ఞం నిర్వహణకు ఉపక్రమించారు.

తొలుత గోపూజ చేసి యజ్ఞ కార్యక్రమాన్ని ఆరంభించారు. మండపంలో ఉంచిన విఘ్నేశ్వరుడికి పూజ చేశారు. పంచద్రవ్య ప్రాసన తదుపరి గణపతికి విశేష అభిషేకాలు, అర్చనచేసి హారతులిచ్చారు. శ్రీ సీతారామచంద్ర సమేత శ్రీ ఆంజనేయస్వామి వార్లకు పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటైన వేదికపై శ్రీ చండీ అమ్మవారిని ఉంచి ఎమ్మెల్యే శివకుమార్,పుష్ప దంపతులు, వారి పెద్దకుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ పూజలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్.భారతి గోత్ర నామాలతో అర్చకులు అర్చనలు చేశారు. బ్రహ్మశ్రీ రేలంగి ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో మహాయజ్ఞం నిర్వహించారు. వేదఘోషతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. మధ్యాహ్నం వరకు జరిగిన యజ్ఞానికి పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు ఎల్ఈడీ స్క్రీన్లలో వీక్షించారు. హోమం అనంతరం మంత్రపుష్పంతో తొలిరోజు కార్యక్రమం ముగిసింది. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సహస్రగళ సంపూర్ణ భగవద్గీత పారాయణం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ పాలకవర్గ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ దంపతులు, వైకుంఠపురం ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కుంభం సాయిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, గుండా పిచ్చయ్య, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కఠారి హరీష్, కుర్రా జస్వంత్ యాదవ్, ఆలమూరి ఫణి, పొత్తూరి రాఘవ, టిక్స్ బాల, చుండూరు సాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ శాంతి

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలిలో శనివారం కొనసాగింది. ఉదయం నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు కొందరు వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండటంతో వలంటీర్లు అక్కడికి వెళ్లి నగదును పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌కు చెందిన పడవల బేబీ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ పాంగోతు శాంతి అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు. చినరావూరుకు చెందిన దర్శిన చిరంజీవికి వికలాంగ పింఛన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ అదిన తిరుపతిరావు, వలంటీర్ కుర్రా అనితలు పంపిణీ చేశారు. అలాగే నెహ్రూరోడ్డుకు చెందిన తిరుమలపూరి అరుణ అనారోగ్యంతో బాధపడుతూ తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ జ్యోతుల సౌమ్య అక్కడకు వెళ్లి వితంతు పింఛన్‌ను పంపిణీ చేశారు. 24వ వార్డులో నూతనంగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య సచివాలంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ అబ్దులా, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వరరావు, సీమోను తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల సంఘాల నిర్వీర్యానికి కుట్ర

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

తెనాలిఅర్బన్: బీసీ కుల సంఘాలను నిర్వీర్యం చేసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హెచ్చరించారు. తెనాలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల ప్రయోజనాల కోసం కుల సంఘాలు ఎంతో పాటుపడుతున్నాయని చెప్పారు. అలాంటి సంఘాలను నియంత్రించాలనే ఉద్దేశంతో కొన్ని రాజకీయ పార్టీలు కుల సంఘాల సమావేశాలకు వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు తన ఇష్ట ప్రకారం నడుచుకునే హక్కు ఉంటుందని గుర్తు చేశారు. ఇలా నియంత్రించే అధికారం ఏ రాజకీయ పార్టీకి లేదని హితవు పలికారు. బీసీలందరూ ఏకతాటిపై వచ్చి రాజ్యాధికార సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ నాయకులు కుర్రా శ్రీను, ఓలేటి శివాజీ, వేమల కృష్ణ, తుల్లిమిల్లి చంటి, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సుందరకాండ గానామృతం



కథాగానం చేస్తున్న డాక్టర్ పి.శ్రీనివాస్

తెనాలి: హనుమంతుని సాహసాలకు సంబంధించిన ఉత్తేజకరమైన, స్ఫూర్తిదాయకమైన కథనమే సుందరకాండగా 'అభినవ సుందరదాసు' డాక్టర్ పి.శ్రీనివాస్ సుందరకాండ అన్నారు. వాల్మీకి రామాయణంలోని పంచమ కాండ అయిన సుందరకాండ మహాశక్తివంతమైనదిగా చెప్పారు. ఈ సుందరకాండను వినడం, పారాయణం చేయటం వల్ల సమస్త దోషాలు, కష్టాలు, అరిష్టాలు తొలగి, సకలాభీష్టాలు, సుఖసంతోషాలు సమృద్ధిగా పొంది ఆనందంగా జీవిస్తారని తెలియజేశారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్–పుష్ప దంపతులచే శనివారం శ్రీ చండీ సహిత హనుమథీశ్వర మహాయజ్ఞం ఆరంభమైంది. ఇందులో భాగంగా సాయంత్రం డాక్టర్ పి.శ్రీనివాస్ సుందరకాండ పారాయణ చేశారు. అయిదేళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ జరుగుతున్న శ్రీ చండీసహిత హనుమథీశ్వర మహాయజ్ఞంలో సుందరకాండ కథాగాన సప్తాహం ఆరంభించారు. వేద స్వరూపమైన వాల్మీకి రామాయణం సమస్త మానవుల సంపదగా గుర్తుచేశారు. లోకానికి, మానవ విలువలతో కూడిన సమాజానికి, కుటుంబ వ్యవస్థకు, వ్యక్తిగత విలువలకు ఆధారమై నిలిచి నేటికీ నడిపిస్తున్న గొప్ప చరిత్ర శ్రీరాముని చరిత్రగా తెలిపారు. 'నా ఎద పలికిన సీతారామకథ/నే పలికెద సీతారామకథ' అంటూ సుందరకాండను గానం చేశారు. అద్భుతమైన రచన, గానం, మనసును తాకే పదాలు, మంచి సాహిత్యం, ఊహకు అందని అతిశయోక్తులతో సీతను వెతికేందుకు సముద్రం దాటి ఆకాశమార్గాన వెళ్లిన హనుమంతుడి సాహసాలను వీనులవిందు చేశారు డాక్టర్ శ్రీనివాస్. సుందరకాండ పారాయణాన్ని విని తరించేందుకు ఎందరో భక్తులు విచ్చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్–పుష్ప దంపతులు, కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వారితో సహా వందలాది భక్తులు తొలిరోజు కథాగానాన్ని ఆసాంతం విని పరమానందభరితులయ్యారు.

నూతన పింఛన్లు పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రేపల్లె రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ పేటేరులో నూతనంగా మంజూరైన పింఛన్లలను శనివారం స్థానిక సచివాలయ భవనంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌ఛార్జ్ కనపర్తి రవికిరణ్ మాట్లాడుతూ ఈ నెలలో నూతనంగా తమ పంచాయతీకి 18 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి నెల 1018 పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో తమ పంచాయతీలో కేవలం ఆరు వందల మంది మాత్రమే పింఛనుదారులు ఉండేవారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లను నిష్పక్షపాతంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావు ప్రభాకరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పింఛన్లు అందజేత

పిట్టలవానిపాలెం : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది జనవరి నుంచి ప్రతినెలా రూ.3వేల పింఛన్‌ను అందించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని భవనంవారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని చోడిపాలెం గ్రామంలో శనివారం కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌లు పెంచడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని ,రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్థూపం సెంటరు వద్ద టూ టౌన్ పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి వద్ద ఆరు మద్యం సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ వ్యక్తిని బాపట్ల జిల్లా వేమూరు మండలం చదలవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

పిట్టలవానిపాలెం: మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో శనివారం గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పరిశ హారిక గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేశారు. ప్రభుత్వం పశు వైద్య శాఖ ద్వారా ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. శుక్ర, శనివారాలలో సచివాలయ పరిధిలోని పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు పరీక్షలను పండగలా భావించాలి



స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న విద్యార్థులు

రేపల్లె రూరల్: విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావు ప్రభాకరరావు అన్నారు. జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పేటేరు జెడ్పీ హైస్కూలులో శనివారం ఆయన పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యార్థులకు తమ పాఠ్యాంశాలను మరోమారు సరిచూసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాజ్యోతి పేరుతో స్టడీమెటీరియల్ అందిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌ఛార్జ్ కనపర్తి రవికిరణ్, హెచ్‌ఎం బాబూజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందజేత

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గ్రామ సర్పంచ్ కుంతం అనూష, వైఎస్సార్ సీపీ నాయకులు కుంతం ప్రసన్నరాజులు శనివారం అందజేశారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఉపయోగపడే విధంగా ఉండే మెటీరియల్‌ను అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం విద్యాజ్యోతి పేరుతో ఈ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ గుమ్మడి సీతయ్య, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి కూసంపూడి దేవేంద్రరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతిరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



రేపల్లె రూరల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం సీఎం సహాయనిధిని ఏర్పాటు చేసిందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఇటీవల నిజాంపట్నం సముద్రతీరంలో పడవ బోల్తాపడి కృష్ణాజిల్లా ఏల్చేటిదిబ్బ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. తల్లి సాయివర్ధిక, కుమారులు తనిష్‌కుమార్, తరుణేశ్వర్‌లు మృతిచెందగా తండ్రి కొక్కిలిగడ్డ సోంబాబు ప్రాణాలతో బయటపడ్డాడు. బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.9 లక్షల చెక్కును కొక్కిలిగడ్డ సోంబాబు కుటుంబ సభ్యులకు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన అందజేశారు.

పెదరావూరులో 'బాబూజీ' బయోపిక్ షూటింగ్ సందడి

తెనాలిరూరల్: నిర్మాణంలో ఉన్న భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ బయోపిక్ 'బాబూజీ' సినిమా షూటింగ్ శనివారం పెదరావూరులో జరిగింది. దర్శకుడు దిలీప్ రాజా మీడియాకు వివరాలను వెల్లడించారు. జగ్జీవన్‌రామ్ స్వగ్రామమైన బీహార్ లోని చాంద్వా గ్రామంలో జరిగిన ఒక సన్నివేశాన్ని ప్రస్తుతం చిత్రీకరిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఇది వందేళ్ల క్రితం జరిగిన యదార్థ జీవిత కథ కావడంతో విశాఖపట్నం సమీపంలోని ఎర్రకొండల్లో కళా దర్శకుడు ఎన్నారీ నేతత్వంలో సెట్ రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ జరుగుతోందని మరో రెండు షెడ్యూల్స్ చిత్రీకరణకు నాలుగు మాసాలు సమయం పడుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రిలతో జగ్జీవన్‌రామ్‌కు ఉన్న సంబంధాలను తెనాలిలోనే చిత్రీకరించినట్లు తెలిపారు. ఇందులో జగ్జీవన్‌రామ్ పాత్రలో నటుడు మిలటరీ ప్రసాద్, ఆయన కుమార్తె మీరా కుమార్ పాత్రలో సీనియర్ నటి తాళ్లూరి రామేశ్వరి, లాల్ బహదూర్ శాస్త్రి పాత్రలో ఉత్తర ప్రదేశ్ నటుడు అమీర్ చోద్రి , గాంధీజీగా కేఆర్‌డీ షెట్టి నటించినట్లు ఆయన చెప్పారు. ముంబయి నటి కావ్యకీర్తి, పూజా కఠారి, సుజాత, భాను మున్నంగి, చదలవాడ హరిబాబు ఈ షెడ్యూల్లో నటిస్తున్నారని తెలిపారు. అనుపమ ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం వినోద్ యాజమాన్య అందించనున్నారు. నిర్మాతలుగా ఆలూరి సుందర రామయ్య, ప్రదీప్‌లు వ్యవహరిస్తున్నారు. చిత్రానికి కథ,మాటలు,స్క్రీన్ ప్లే, దర్శకత్వం దిలీప్ రాజా అందించనున్నట్లు చెప్పారు.

కొంకలూరు కవి ప్రజ్ఞాచారికి పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రజ్ఞాచారి

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి రాజమహేంద్రవరంలో జరుగుతున్న రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్ర నిరాజన మహోత్సవాల్లో శనివారం పాల్గొన్నారు. అంతర్జాతీయ తెలుగు మహోత్సవాలు రాజమహేంద్రవరంలో జరిగాయి. ఈ ఉత్సవాలలో 'తెలుగు సౌరభం' అను శీర్షికతో తన సీస పద్యాలను చదివినట్లు ప్రజ్ఞాచారి తెలిపారు. తెలుగు భాష వైభవం అంతరించిపోతున్న నేటి రోజుల్లో తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని తెలియజేసినట్లు చెప్పారు. సభల కన్వీనర్ పద్మావతి, నిర్వాహకులు డాక్టర్ ఎస్ఆర్ఎస్. కొల్లూరి, సమన్వయకర్త శేషగిరి శర్మల నుంచి ప్రజ్ఞాచారి ప్రశంసాపత్రం అందుకున్నారు. కొలకలూరు గ్రామస్థులు, కవులు, కళాకారులు ప్రజ్ఞాచారిని అభినందించారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేత

తెనాలి: జిల్లా పరిషత్ మాజీ ఛైర్ పర్సన్, మాజీ ఎమ్మెల్యే దొడ్డపనేని ఇందిర 87వ జయంతి సందర్భంగా శనివారం ఆమె పేరుతో నడుస్తున్న స్థానిక కొత్తపేటలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపకార వేతనాలు అందజేశారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు దొడ్డపనేని ఇందిర కుమార్తె, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ రూ.9వేలు చొప్పున అందజేశారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. ముందుగా దొడ్డపనేని ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఎంపీపీ కొడాలి ఆదిలక్ష్మి, శ్రీనివాసరావు, వేజండ్ల శ్రీలక్ష్మి, బొల్లినేని గోవర్ధనకుమారి, దేవినేని రమాదేవి, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, రాజశేఖర్‌రెడ్డి, షేక్ సుభాని, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, కొప్పుల లక్ష్మి, ద్రాక్షాయణి, షక్ ఆసిస్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



అక్షింతల పంపిణీలో పాల్గొన్న సంకీర్తనా బృందం సభ్యులు

తెనాలిటౌన్: అయోధ్య బలరాముని అక్షింతలను ఇంటింటికీ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. షరాఫ్‌బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి సంకీర్తనా బృందం, సేవా సమితి సభ్యులు అక్షింతల పంపిణీ ప్రారంభించారు. మహిళలు ఇంటింటికీ వెళ్లి అక్షింతలను, అయోధ్య రామ మందిరం ఫోటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక సభ్యులు ఎస్.బి.శివ, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్, బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వర్లు, మాజేటి వెంకటేష్, రొంపిచర్ల సురేష్, కె.రమణకుమార్, బృందం సభ్యులు కె.శారద, పి.రాణి, ఎం.లక్ష్మీసునీత, జి.విజయలక్ష్మి, తన్నీరు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

రేపల్లె రూరల్: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ విజయానికి కలిసికట్టుగా శ్రమించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గతంలో పనులు పూర్తి చేసిన పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యుఎస్ శాఖల నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పించాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంపీ మోపిదేవి బిల్లులను వెంటనే మంజూరుచేసి అభివృద్ధికి సహకరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, ఎంపీడీవో శివపార్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'విజయానికి మార్గదర్శి' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శేషగిరిరావు

అమర్తలూరు(వేమూరు): సివిల్స్ పోటీ పరీక్షలకు 'విజయానికి మార్గదర్శి' పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర గ్రంథాలయం ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అల్లమూడి ప్రభాకరరావు, రాష్ట్ర గ్రంథాలయం ఛైర్మన్ శేషగిరిరావు శనివారం ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి అప్పికట్ల భరత్ భూషణం ఎంతో మంది విద్యార్థులకు సివిల్స్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాంటి వ్యక్తి రచించిన 'విజయానికి మార్గదర్శి' పోటీ పుస్తకం విడదల చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఇలాంటి పుస్తకాలు చదవడం వల్ల ఉద్యోగాలు త్వరగా సాధించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొక్కిల గడ్డ కిరణ్, తెనాలి బీజేఆర్ కమిటీ ప్రెసిడెంట్ మేకల సురేష్, సభ్యులు యడ్లపల్లి అనిల్ కుమార్, వేజండ్ల శ్రీకాంత్, మండల నాయకులు పోతార్లంక సురేష్, బర్మా ప్రవీణ్, కోళ్లమూడి ఆశోక్, మూల్పూరు ప్రతాప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై మెరుపు దాడులు

బాపట్లటౌన్: నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని స్టువర్టుపురం గ్రామంలో శనివారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బాలరాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని నాటుసారా తయారుచేసేందుకు సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా బాపట్ల మండలం మరుప్రోలువారి పాలెం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న భూషణం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్దనుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.